క్లుప్తంగా

పీవీకి భారతరత్న.. తెలుగువారికి గర్వకారణం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దివంగత, మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడం తెలుగు ప్రజలకే గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకప్పుడు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడంతో పాటు ప్రపంచమంతా భారతదేశం వైపు చూసేలా చేసిన మహా మేధావి పీవీ అని కొనియాడారు. సకలభాషా కోవిదునిగా, గొప్ప రచయిత అయిన పీవీకి భారతరత్న పురస్కారం ప్రకటించడం సముచిత నిర్ణయమని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు ప్రకటించారు.

23న దుకాణాల లీజుకు వేలం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక గడియార స్తంభం రోడ్డులోని దేవదాయ శాఖ పరిధిలో ఉన్న శ్రీ అన్న, వస్త్ర, వైద్య, విద్యాదాన సమాజానికి చెందిన రెండు దుకాణాల లీజు నిమిత్తం ఈ నెల 23న టెండర్, బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఆ సంస్థ కార్యనిర్వహణాధికారి సీహెచ్ వి.నాగమునేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కుండీ సెంటర్ వద్ద ఉన్న శ్రీ అన్న, వస్త్ర, వైద్య, విద్యాదాన సమాజం కాంప్లెక్స్‌లో ఉదయం 11 గంటలకు, 11.30 గంటలకు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఒక్కో దుకాణానికి రూ.10 వేలు దరావతు చెల్లించాలని, నెలసరి లైసెన్స్ ఫీజు చెల్లించే పద్ధతిపై మూడేళ్ల కాలపరిమితికి లీజుకు కేటాయిస్తామని తెలిపారు. పాట పాడుకున్నవారు 12 నెలల లైసెన్స్ ఫీజు అడ్వాన్సుగా చెల్లించాలని పేర్కొన్నారు. హిందువులు మాత్రమే వేలంలో పాల్గొనడానికి అర్హులని తెలిపారు.

సమ్మెను విజయవంతం చేయాలి

ఏలూరు (టూటౌన్): కేంద్రంలో మోదీ ప్రభుత్వ విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా – కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు ఈ నెల 16న నిర్వహించే గ్రామీణ భారత్ బంద్ – పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని రైతు, కార్మిక, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పిలుపు నిచ్చారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సంయుక్త కిసాన్ మోర్చా – కార్మిక సంఘాల ఐక్య వేదిక సంయుక్త జిల్లా సమావేశం బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ రైతాంగ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. వ్యవసాయ కార్మికులకు సంవత్సరంలో 200 రోజులు పనులు కల్పించి రోజుకి కనీస వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు డీఎన్‌వీడీ ప్రసాద్, బద్దా వెంకట్రావు, నిమ్మగడ్డ నర్సింహా, కె.శ్రీనివాస్, తలారి ప్రకాష్, కె.కృష్ణమాచార్యులు, ఆర్ శ్రీనివాస డాంగే, కేఎస్‌కే బాషా, కె.విజయలక్ష్మి, వెజ్జు శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

- టీడీపీ, జనసేన నేతలకు వైఎస్సార్ సీపీ నేతల సవాల్
- ఎమ్మెల్యే నాని నేతృత్వంలో రూ.40 కోట్లతో రోడ్ల అభివృద్ధి
- ఇడా చైర్మన్ బొద్దాని, క్లస్టర్–1 అధ్యక్షుడు సుంకర



ఫిల్‌హౌస్‌పేట రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఇడా చైర్మన్ శ్రీనివాస్, క్లస్టర్–1 అధ్యక్షుడు చంద్రశేఖర్

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, ఏలూరు నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులు ప్రతిపక్షాలకు కనిపించడం లేదా అని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, పార్టీ క్లస్టర్–1 అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్ ప్రశ్నించారు. ఏలూరు నగరంలో అభివృద్ధి లేదంటూ టీడీపీ, జనసేన నేతలు కొద్ది రోజుల క్రితం ఆయా ప్రాంతాల్లో హడావిడి చేసి అసత్య ప్రచారాన్ని చేయడంపై వైఎస్సార్ సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు మంచి చేయడం తెలియని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తూ ప్రజలను మభ్య పెట్టేందుకు కుటిల రాజకీయాలు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. శుక్రవారం నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఏలూరు వన్‌టౌన్ ఫిల్‌హౌస్‌పేట ప్రధాన రహదారి నిర్మాణ పనులకు ఇటీవల ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని శంకుస్థాపన చేసిన ప్రాంతంలో వైఎస్సార్ సీపీ నేతలు పర్యటించి అక్కడ నుండే ప్రతిపక్షాలకు దీటైన సమాధానం చెప్పారు.



చాటపర్రు సెంటర్ నుంచి ఫిల్‌హౌస్‌పేట రోడ్డు



శరవేగంగా సాగుతున్న రోడ్డు పనులు

రూ.1.50 కోట్లతో రోడ్డు పనులు ప్రారంభం

ఏలూరు వన్‌టౌన్‌లోని ఫిల్‌హౌస్ ప్రధాన రహదారి నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభించారు. రూ.1.50 కోట్లతో నిర్మిస్తోన్న రోడ్డు పనులను వైఎస్సార్ సీపీ నేతలు పర్యవేక్షించారు. టీడీపీ, జనసేన నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొడుతూ ప్రజలకు వాస్తవాలను తెలియజేశారు. తూర్పువీధి వేణుగోపాల స్వామి గుడి ప్రాంతంలో రూ.90 లక్షలతో నిర్మిస్తోన్న రోడ్డు నిర్మాణ పనులు, ఇందిరమ్మ కాలనీ ప్రాంతంలో రూ.1.50 కోట్లతో నిర్మిస్తోన్న రోడ్డు పనులను నేతలు పరిశీలించారు.

బహిరంగ చర్చకు సిద్ధమా

ఎమ్మెల్యే నాని నగరంలో గత ఐదేళ్లుగా చేస్తోన్న అభివృద్ధి పనులపై ప్రతిపక్ష నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా అని పార్టీ క్లస్టర్–1 అధ్యక్షులు సుంకర చంద్రశేఖర్ సవాల్ విసిరారు. ఇటీవల కాలంలో ఎమ్మెల్యే నాని నగరంలోని ప్రతి డివిజన్‌లో అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారని చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.30 కోట్లు, ఏలూరు నగర పాలక సంస్థ జనరల్ ఫండ్ నిధులు రూ.11 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించారని వివరించారు. ప్రతి డివిజన్‌లోనూ రూ.కోటిన్నర నుంచి రూ.3 కోట్ల మేర అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని, గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి కాలనీలోనూ సీసీ రోడ్లు నిర్మాణం చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వంకదారు ప్రవీణ్, సబ్బన శ్రీనివాస్, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ వైఎన్‌వీ శివరావు, జేసీఎస్ ఏలూరు క్లస్టర్–1 కన్వీనర్ మోటమర్రి సదానందం, పార్టీ నాయకులు లంకలపల్లి గణేష్ తదితరులున్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీల్లో భాగంగా డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు నాలుగేళ్లుగా వైఎస్సార్ ఆసరా పేరుతో సొమ్మును బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని ఏలూరు నియోజకవర్గ పరిధిలో అల్లూరి సీతారామరాజు స్టేడియంలో శనివారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లను నగర కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ పూర్తి చేశారు. ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొంటారు.

రాత్రి 8.30 గంటలకు నీటి సరఫరా

ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో శనివారం తాగునీటి సరఫరా (శనివారం) వేళల్లో మార్పు చేశామని నగర కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ తెలిపారు. శనివారం సాయంత్రం తాగునీటి సరఫరా 6.30 గంటలకు బదులుగా రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు సరఫరా చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

రేపు చర్చి వార్షికోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక గ్రేవియర్ నగర్‌లోని అమలోద్భవి మాత కెథిడ్రల్ చర్చి వార్షికోత్సం, లూర్దు మాత మహోత్సవాన్ని ఈ నెల 11న నిర్వహించనున్నట్టు చర్చి విచారణ గురువు ఫాదర్ ఐ.మైఖేల్ తెలిపారు. నవదిన ఉత్సవాలు ముగింపు రోజైన 11వ తేదీన సాయంత్రం సెయింట్ ఆన్స్ కాన్వెంట్ నుంచి ఊరేగింపు, ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు దివ్యబలి పూజ ఉంటుందని పేర్కొన్నారు.

తాగునీటి చెరువులు నింపండి

ఎంపీపీ శ్రీనివాసరాజు

ఏలూరు రూరల్: గ్రామాల్లో తాగునీటి చెరువులు నింపాలని ఏలూరు రూరల్ ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బి.ప్రణవి, ఏఓ సుజాతతో కలిసి తాగునీటి వ్యవస్థపై ఆయన చర్చించారు. ప్రభుత్వం కృష్ణా కెనాల్ నుంచి విడుదల చేసిన నీరు ఏలూరు నగరానికి చేరుకుందన్నారు. గ్రామ పరిసరాల్లోని కాలువలో చెత్త చెదారం తొలిగించాలని, చెరువు గట్లపై బ్లీచింగ్ చల్లించాలని అన్నారు. మొదట కాలువ గుండా పారే మురుగు నీరు కిందకు వదిలేసి, స్వచ్ఛమైన నీటితో చెరువులు నింపాలని ఆదేశించారు. రానున్న వేసవికాలంలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చూడాలని ఎంపీడీఓను కోరారు. కొల్లేరు గ్రామాలకు తాగునీరు అందించే మొండికోడు రిజర్వాయర్ సైతం



తాగునీటి అవసరాలపై అధికారులతో చర్చిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరాజు

పూర్తినీటితో నింపాలన్నారు. నీటిని తోడేందుకు అవసరమైతే మరిన్ని మోటార్లు ఉపయోగించాలన్నారు.

తాగునీటి వ్యవస్థ అభివృద్ధి

గతంలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చొరవతో ప్రభుత్వం రూ.10 కోట్లతో తాగునీటి వ్యవస్థ అభివృద్ధి చేసిందని ఎంపీపీ చెప్పారు. మాదేపల్లిలో రూ.80 లక్షలతో పూర్తి చేసిన 200 లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు, మల్కాపురంలో రూ.40 లక్షలతో 90 కేఎల్ ట్యాంకుతో పాటు శ్రీపర్రు, గుడివాకలంక 60 కేఎల్ ట్యాంకులు మరో రెండు ట్యాంకులు నిర్మించామని తెలిపారు. మహేశ్వరపురం, తిమ్మారావుగూడెం, కలకుర్రులో రూ.44 లక్షలు వెచ్చించి మూడు ట్యాంకులు, చాటపర్రు, కాట్లంపూడి, కోటేశ్వరదుర్గాపురంలో మరో మూడు 40 కేఎల్ ట్యాంకులు నిర్మించామని చెప్పారు. మరో రూ.2.37 కోట్లతో పలు గ్రామాల్లో 20 కిలో మీటర్ల దూరం కొత్త పైప్‌లైన్ వేసి, ఉచితంగా కుళాయి బిగించామని వివరించారు. తాగునీటి సరఫరా, పరివేక్షణపై ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి పరివేక్షించాలని ఎంపీడీఓకు సూచించారు. నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు ఉంటాయన్నారు.

ఇంటింటా ఓటు పరిశీలన

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలోని ప్రతి ఓటరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని క్లస్టర్–1 పార్టీ అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్ కోరారు. ఏలూరు వన్‌టౌన్ 6వ డివిజన్‌లో ఇంటింటికి వెళ్లి ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటిలోనూ ఓటు హక్కు ఉన్న సభ్యుల వివరాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని ఆదేశాల మేరకు ఏలూరు నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లోనూ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, బీఎల్‌ఓలు, గృహసారథులు, గడపగడపకూ వెళ్లి వివరాలు తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు చేస్తోన్న ఆరోపణలపై వాస్తవాలు తెలుసుకోవడంతో పాటు ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీలు దొంగ ఓట్లు నమోదు చేశారనే ఆరోపణల నేపథ్యంలో ప్రతి ఇంటిలోనూ అర్హులందరికీ ఓటు హక్కు ఉండేలా శ్రద్ధ వహిస్తున్నామని చెప్పారు.



6వ డివిజన్‌లో ఓటర్ల సర్వేలో వైఎస్సార్ సీపీ క్లస్టర్–1 అధ్యక్షుడు చంద్రశేఖర్

- ఏలూరు వన్‌టౌన్ 19వ డివిజన్‌లో ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాల మేరకు ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమం కార్పొరేటర్ యర్రంశెట్టి నాగబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకురాలు భోగిశెట్టి పార్వతి, గృహసారథులు, బీఎల్‌ఓలు చేపట్టారు. ప్రతి ఇంటిలోనూ వృద్ధులు, కుటుంబ సభ్యుల ఓట్లను ఓటరు జాబితాలో వెరిఫికేషన్ చేశారు.

అంజుమన్ సంస్థలో లుకలుకలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ప్రముఖ ముస్లిం సంస్థ అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థలో లుకలుకలు ప్రారంభమయ్యాయి. నగరంలో అనేక ఆస్తులు, ఆదాయం ఉన్న ఈ సంస్థపై పట్టు కోసం ముస్లింలలోని కొన్ని వర్గాలు ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటాయి. గతంలో ఈ సంస్థ పాలక వర్గం పదవీ కాలం ముగిసినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో మరో వర్గం కోర్టుకెళ్లి ఎన్నికలు నిర్వహించేలా ఆర్డర్ తెచ్చుకుంది. అనంతరం జరిగిన ఎన్నికల్లో పాత పాలకవర్గాన్ని కాదని కొత్తగా పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్య



అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ భవనం

వర్గం కూడా పాత పాలకవర్గం తరహాలోనే పదవీ కాలం ముగిసినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో మరోసారి ఆ సంస్థలో వర్గపోరు ప్రారంభమైంది. ఈ పాలకవర్గం గడువు రెండేళ్ల క్రితమే ముగిసిందని, సంస్థ బైలా ప్రకారం ఏటా జనరల్‌బాడీ సమావేశం నిర్వహించాల్సి ఉండగా ఒక్క సంవత్సరం కూడా సర్వసభ్య సమావేశం నిర్వహించకపోవడంతో మరో వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఇదిలాఉండగా గతేడాది ఆగస్టులో సర్వసభ్య సమావేశం నిర్వహించి అడ్‌హాక్ కమిటీని ఎన్నుకున్నారు. ఆ కమిటీ ఎన్నికైన వెంటనే జీవితకాల సభ్యత్వాలు తీసుకోవాలని, ఎన్నికల అధికారిని నియమించి రెండు నెలల వ్యవధిలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని తీర్మానం చేశారు. అయితే అడ్‌హాక్ కమిటీ సైతం ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోకపోవడంతో పాలకవర్గంలోని 16 మంది సభ్యులు ఇటీవల కోర్టులో కేసు వేశారు. ఈ వ్యవహారంపై రెండు వర్గాల నాయకులూ ఒకరిపై ఒకరు సోషల్ మీడియాలో వ్యతిరేక ప్రచారం చేసుకుంటూ సమస్యను మరింత క్లిష్టతరం చేసుకుంటున్నారని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా శనివారం ఈ సంస్థ అడ్‌హాక్ కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ప్రకటించింది. దీనిపై కమిటీ వ్యతిరేక వర్గం అడ్‌హాక్ కమిటీకి సర్వసభ్య సమావేశం నిర్వహించే అధికారం లేదని, ఎన్నికలను సక్రమంగా, సకాలంలో నిర్వహించడానికి మాత్రమే అడ్‌హాక్ కమిటీకి అధికారం ఉందని చెబుతోంది. అయినప్పటికీ శనివారం నిర్వహించే సర్వసభ్య సమావేశానికి హాజరై అమీతుమీ తేల్చుకోవడానికి వ్యతిరేకవర్గం సన్నద్ధమౌతున్నట్టు తెలిసింది. ప్రస్తుతం ఈ సంస్థకు చెందిన సభ్యులు వివిధ పార్టీల్లో సభ్యులుగా ఉండడంతో శనివారం నిర్వహించే సర్వసభ్య సమావేశంలో రాజకీయ ప్రమేయం కూడా ఉండే అవకాశం ఉందని ముస్లిం వర్గాలు చర్చించుకుంటున్నాయి.

ఈ–చలానాలను రద్దు చేయాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో ఆటోలు, టాక్సీలపై విధించిన ఈ–చలానాలను రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట వర్కర్స్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి జె.గోపి కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సంఘం సమావేశం శుక్రవారం నిర్వహించారు. గోపి మాట్లాడుతూ ఏలూరు నగరంలో సెన్సార్ కెమేరాలను సరైన దిశలో అమర్చలేదని, జీబ్రా లైన్ వైలేషన్ పేరు తో అడ్డగోలుగా ట్రాఫిక్ పోలీసు విభాగం ఆటో, ట్యాక్సీలపై చలానాలను విధించడం దారుణమన్నారు. ఈ–చలానాల వల్ల ఆటో, టాక్సీ డ్రైవర్లు వేలాది రూపాయలు నష్టపోతున్నారన్నారు. గతంలో దీనిపై జిల్లా కలెక్టర్, ట్రాఫిక్ సీఐలకు సీఐటీయూ యూనియన్ తరుపున వినతి పత్రాలు ఇచ్చామని తెలిపారు. తక్షణం ఈ–చలానాలను రద్దు చేయాలని కోరా రు. సమావేశానికి బుద్దా నాగ సూరిబాబు అధ్యక్షత వహించగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు, ఆటో యూని యన్ నాయకులు మెరుగు రాఘ వ, చక్రాల అమర్ కుమార్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	36
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	64
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	08-10
బెండకాయలు	40	కంద	68
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	40
కాకర కాయలు	30-50	కీరా దోస	30
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	64
బీరకాయలు (పందిరి)	--	అల్లం	120
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	28	పాలకూర	10
దొండకాయలు	34	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	20-25	గోంగూర	08
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	30-40	బఠాణి	--
అనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	43
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	23
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	27

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	13
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	21
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	29

నులి పురుగుల నివారణతో పిల్లలకు మేలు



కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్యార్థినికి మాత్ర వేస్తున్న దృశ్యం



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు మాత్రలు వేస్తున్న రాము

ఏలూరు రూరల్: పిల్లల మానసిక, శారీరక ఎదుగుదల కోసం నులి పురుగులు నివారణ అవసరమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి అన్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఏలూరు కస్తూర్బా బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కడుపులో నులిపురుగులు పెరగడం వల్ల పిల్లలు శారీరక, మానసికంగా బలహీనపడతారని చెప్పారు. దీన్ని నివారించేందుకు ఆల్బెండజోల్ మాత్రలు పిల్లలకు వేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేతుల శుభ్రతపై చేసిన నృత్యరూపకం ఆకట్టుకుంది. హెచ్‌ఎం జి.సునీత, మాలతి విద్యార్థులతో నులిపురుగుల నివారణ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో యూపీఎంసీ వైద్యాధికారి నీలిమ, ఆర్‌బీఎస్‌కే టీమ్ సభ్యులు భరత్, రాజీవ్, ఉపాధ్యాయులు ఎంపీ సుబ్బారావు, శాంతామణి, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

- 15వ డివిజన్ అంగన్‌వాడీ కేంద్రంలో నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కార్పొరేటర్ తంగెళ్ళ రాము కోరారు. ఈ సందర్భంగా పిల్లలతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు.

అజాగ్రత్తగా వాహనాలు నడిపితే అనర్థమే

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రోడ్లపై అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్ల అనేక అనర్థాలకు దారితీస్తుందని ఉప రవాణా కమిషనర్ ఎస్ శాంతకుమారి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక సెయింట్ థెరిసా డిగ్రీ కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాంతకుమారి మాట్లాడుతూ రోడ్డులపైకి హఠాత్తుగా వెళ్లడం వల్ల ఆయా వాహనాలను అదుపు చేయడం కష్టమవుతుందని, రోడ్డులపై నడిచేటప్పుడు, దాటేటప్పుడు నిబంధనలు తప్పకుండా పాటించడం



మాట్లాడుతున్న శాంతకుమారి

వల్ల ప్రమాదాలకు తావుండదని అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు అతివేగం, ఫోన్ మాట్లాడటం మానుకోవాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పక ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం యువత మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రహదారి భద్రత వైద్యురాలు జి.మౌనిక గుడ్ సమర్టిన్ చట్టం, గోల్డెన్ అవర్ గురించి వివరించారు. బాధితుడిని సత్వరమే ఆసుపత్రికి తరలించడం, సీపీఆర్ చేసే విధానాన్ని వివరించారు. బాధితుడి ప్రాణం కాపాడిన వారికి గుడ్ సమార్టిన్‌గా ప్రకటిస్తూ రూ.5000 నగదు బహుమతి చెల్లిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు కేవీఎస్ ప్రసాద్, జి.ప్రసాదరావు, కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, విద్యార్థులు, కళాశాల బస్సు డ్రైవర్లు, క్లీనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.